


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**సిబ్బంది అంతా** నిస్సహాయంగా చూస్తూ ఉండగా బ్యాంకర్లు వచ్చి గోడౌన్లకి తాళాలు వేసి సీల్ చేసి వెళ్ళిపోయారు. ఒంటె నడుము మీద ఆఖరి గడ్డి పరక అది. వ్యాపారం ఇక శాశ్వతంగా మూల పడినట్టే.

ఏమి చెయ్యాలా అని ఆమె ఆలోచిస్తున్న సమయంలో ఫోన్ వచ్చింది.

''శ్రీకళ్యాణిగారు ఉన్నారా?''

''మాట్లాడుతున్నాను. ఎవరు మీరు?''

''వివేకానందగారి పి.ఏ ని. మినిష్టర్‌గారు మీతో మాట్లాడతారట'' ఫోన్‌లో చిన్న చప్పుడు, కొన్ని క్షణాల తరువాత వివేకానంద కంఠం వినిపించింది. ''ఎవరూ? కళ్యాణీగారా?''

సెంట్రల్ మినిష్టర్‌కి తనతో ఏం పనో ఆమెకి అర్థంకాలేదు. ''అవును సర్'' అంది.

''నేను వివేకానందని మాట్లాడుతున్నాను.''

వి.. వే.. కా.. నం.. ద.

''చెప్పండి సర్.''

''ఫోన్‌లో కాదు. నేనొచ్చి స్వయంగా మాట్లాడతాను. ఓ గంట టైమ్ ఇవ్వగలవా?''

''అదేమిటి సర్. మీరొస్తానంటే అభ్యంతరం ఏముంటుంది?'' ఇంగ్లీషులో అంది.

''ఇంకో పదినిమిషాల్లో వస్తాను'' ఆగి అన్నాడు. ''చాలా వ్యక్తిగతమైన విషయం. దయచేసి ఇంకెవరూ లేకుండా చూడు. నీ భర్తతో సహా–''

ఆమె భృకుటి ముడివడింది. తామిద్దరూ మాట్లాడుకునేటప్పుడు తన భర్తని ఎందుకు ఆయన ఉండవద్దన్నాడో ఆమెకు అర్థంకాలేదు. ఏమీ ప్రశ్నించకుండా ఆమె ఫోన్ పెట్టేసింది. పది నిమిషాల తర్వాత కారొచ్చి పోర్టికోలో ఆగింది. ఎక్కువ మంది లేరు. ఆయనా, బాడీగార్డులూ అంతే. నౌఖరు సాదరంగా ఆయన్ని పైకి తీసుకెళ్ళాడు.

''రండి. కూర్చోండి. ఐయామ్ సారీ. నేను లేవలేను'' అంది కళ్యాణి.

‘‘ఫర్వాలేదు. నాకు తెలుసు’’ కుర్చీలో కూర్చుంటూ అన్నాడు. ఆమె ఆరోగ్యం గురించి కొంచెం సేపు ప్రశ్నించాడు. ఆయన వచ్చింది ఇటువంటి యోగక్షేమాలు అడగటానికి కాదనీ వేరే ఏదో పని ఉందనీ ఆమెకు తెలుసు. అయినా తెలియనట్టే జవాబు ఇచ్చింది. ఆయన కూడా తాను వచ్చిన పని చెప్పవలసిన సమయం ఆసన్నమయినట్టు, విషయనికి వస్తూ, ‘‘మీ కార్తికేయ సిమ్లా పోటీలకు వచ్చాడు కదూ’’ అన్నాడు.

‘‘అవును’’ అన్నదామె.

సినిమాలో ఒక గొప్ప సీను ప్రారంభానికి ముందు ప్రేక్షకుల్ని మూడ్‌లోకి తీసుకు వెళ్ళటానికి సంగీతదర్శకుడు వదలిన నిశ్శబ్దంలా, ఆ గదిలోనూ నిశ్శబ్దం వ్యాపించింది. దాన్ని భంగపరుస్తూ ఆయన అన్నాడు. ‘‘నాకెందుకో కార్తికేయ మామూలు వ్యక్తిలా కనిపించలేదు. ఏదో గొప్పశక్తిని తనలో దాచుకున్న అపురూపమైన మనిషిలా కనిపించాడు. నా అభిప్రాయాన్ని నా కూతురు బలపర్చింది. అలాటి పెయింటర్ శతాబ్దానికి ఒకరు పుడతారని చెప్తే ముందు నేను నమ్మలేదు. అతను సిమ్లాలో వేసిన పెయింటింగ్స్‌ని తెప్పించాను. నేను చూడటమే కాదు. ఆ రంగంలో నిష్ణాతులయినవాళ్ళతో పరీక్ష చేయించాను. వాళ్ళు చెప్పిందేమిటంటే–’’ ఆగి పూర్తి చేశాడు. ‘‘... అది అద్భుతం! నిజంగా అద్భుతమైన కళాఖండం. ఒకటి రెండు రోజుల్లోనే అంత గొప్ప చిత్రం వేయగలిగాడంటే, అతడు మామూలు మనిషై ఉండడు. భూమ్మీద ఒక పని పూర్తిచేయటం కోసం దేవుడు పంపిన మనిషి అయివుంటాడు.’’

ఆ తరువాత ఆయన స్పష్టంగా క్లుప్తంగా చెప్పాడు. ‘‘ఇక అసలు విషయానికి వస్తే లీనార్డో, మైకెలాంగిలో, పికాసోల తరువాత నీ భర్తని ఈ చరిత్రలో నాలుగోవాడిని చేయటానికే నేనిక్కడికి వచ్చాను.’’

పెద్ద చప్పుడుతో ఏ.సి. ప్రారంభమయింది. శ్రీకళ్యాణి బ్లాంక్‌గా ఆయన వైపు చూస్తోంది. ఆయన చెపుతున్నది తనకి అర్థం కాలేదో, లేక అర్థమైనది మెదడు స్వీకరించలేదో ఆమెకే తెలియటం లేదు.

‘‘... నీ కిదంతా ఆశ్చర్యంగా ఉండొచ్చు. కానీ నాకెందుకో అలా అనిపిస్తోంది. నేనిదంతా నిస్వార్థంగా ఏమీ చేయటం లేదు. రాజకీయ నాయకుడెవరూ స్వార్థం లేకుండా ఏ పనీ చేయడు. నేను నీ భర్తచేత ఒక బొమ్మ వేయిస్తాను. ఒక రకంగా చెప్పాలంటే అతడి సమయాన్నీ, కళనీ కొనుక్కుంటానన్నమాట. ఆ తరువాత ఏ బ్రిటీష్ మ్యూజియంకో దాన్ని అమ్ముకుంటాను. అదంతా నా గొడవ. లాభం రానీ. నష్టంరానీ. నేను భరిస్తాను. పేరు మీదీ, లాభం నాదీ! ఈ ఒప్పందం బావుందా?’’

ఆమె ఇంకా తేరుకోలేదు. ఆయన ఇంకాస్త విపులంగా అన్నాడు. ‘‘ఈ ప్రపంచపు అత్యుత్తమ చిత్రం మోనలిసా. అది రెండో స్థానానికి వెళ్ళిపోయేటట్టుగా... ఒక అద్భుతమైన చిత్రం కార్తికేయతో నేను వేయించుకుంటాను. దాన్ని ఎలా మార్కెట్‌లో పెట్టాలో... దాని రేటు ఎలా పెంచాలో... అన్నీ నేను చూసుకుంటాను. ఒక పెద్ద దేశపు కేంద్రమంత్రిగా దాన్ని

సాధించటం నాకు పెద్ద కష్టం కాదు. ఇక దానిలో ఏ మాత్రం విషయం ఉన్నా, చరిత్రలో అది నెంబర్‌వన్‌గా నిలిచిపోతుందని నాకు నమ్మకం ఉంది.చెప్పు కళ్యాణి. దీనికి నువ్వు ఒప్పుకుంటావా?''

''నాదేముంది? ఆయన ఒప్పుకుంటే...''

''అతన్ని ఒప్పించాలి.''

''వినరు. డబ్బు కోసమంటే అసలు వినరు.''

''అందుకే నీ దగ్గరకి వచ్చాను. లేకపోతే నేనే డైరెక్టుగా అడిగి ఉండేవాడిని.''

ఆమె జవాబు చెప్పలేదు.

''ఇందులో కేవలం డబ్బేకాదు. కీర్తి... ప్రతిష్ట... చరిత్రలో...'' అంటూన్న ఆయన మాటల్ని మధ్యలో ఆపుచేస్తూ ''కీర్తి – ప్రతిష్ట – ఇలాటివేమీ ఆయనకి పట్టవు'' అంది.

''నాకు తెలుసు. మోనలిసా పెయింట్ వేసిన చిత్రకారుడు కూడా ఇవన్నీ ఆశించి గానీ, చరిత్రలో నిలబడిపోతాననిగానీ దాన్ని వేసి ఉండడు. ''

''మరి నేనేం చేయగలను?''

''బొమ్మ వేయటానికి వప్పించు. మిగతా విషయాలు నాకు వదిలిపెట్టు. ఆ బొమ్మ ఎలా ఉన్నా సరే, దాన్ని వెయ్యటానికి పట్టే కాలానికి నేను ఖరీదు చెల్లిస్తాను.''

''ఖరీదు సంగతి అలా ఉంచండి. ఆయనకి వ్యాపకం కల్పించటం కోసం, మొన్న నేను వేయమంటేనే ఆయన వెయ్యలేకపోయారు.''

''అది అతని తప్పు కాదు. ఈ వాతావరణం తప్పు. దాన్నించి విడదీయాలి.''

''అంటే?''

''అతను బొమ్మ వేస్తున్నంత కాలం నాతోనే ఉంటాడు. నాతో అంటే నాతోకాదు. ఏ స్విట్జర్లాండ్‌లోనో, కన్యాకుమారిలోనో – అతను ఎక్కడ కావాలంటే అక్కడ–''

''ఎంతకాలం?''

''బొమ్మ పూర్తయ్యే వరకూ. ఎంతకాలమైనా సరే.అది రెండు నెలలు కానీ, ఆర్నెల్లు కానీ – అంత వరకూ నువ్వు అతన్ని చూసే ప్రయత్నం కూడా చేయకూడదు.''

ఆమె మొహం చిట్లించింది.

''అవును. అందుకే నీ దగ్గరకి వచ్చాను. అతనితో ప్రపంచపు అత్యుత్తమ బొమ్మ వేయించాలంటే అతన్ని మన ప్రపంచానికి దూరం చేయాలి. దానికి నీ అనుమతి కావాలి.''

ఆమె మాట్లాడలేదు. ఆయన బ్రీఫ్ కేస్ తెరిచాడు. ''అతడు బొమ్మ వేయటానికి ఎంతకాలం పడుతుందో నాకు తెలీదు. ఎన్ని నెలలు పడితే అన్ని నెలలు నెలకు పది లక్షలు చొప్పున ఇస్తాను. ఇదిగో నాలుగు నెలలు అడ్వాన్స్... నలభై లక్షలు.''

ఆమె ఊపిరి బిగపట్టింది. న...ల...భై...ల...క్ష...లు!

ఆయన బ్రీఫ్ కేస్ మూసేశాడు. ఆమె అంది–''మీరే స్వయంగా కార్తికేయతో మాట్లాడితే బావుంటుందేమో!''

''వినడు. ఈ కళాకారులంత మొండివాళ్ళు మరెవరూ ఉండరు. నా కూతురు కూడా అంతే. నీకు తెలుసు కదా! నలభై లక్షలు కాదు. నాలుగు కోట్లు ముందు పెట్టినా తీసుకోడు.''

''నేను మాత్రం తీసుకుంటానని మీకేమిటి నమ్మకం?''

''వచ్చేముందు అంతా ఎంక్వయిరీ చేసే వచ్చాను. మీ ఆర్థిక స్థితి నాకు తెలుసు.''

ఆమె ఆశ్చర్యాన్ని అణుచుకునే ప్రయత్నం ఏమీ చేయలేదు. విస్మయంగా చూస్తూ ఉండిపోయింది. ఆయన అన్నాడు ''నేను నీ బ్యాంకర్స్‌తో మాట్లాడతాను. రేపట్నుంచే వాళ్ళ ఆంక్షలు తొలగించేలా చేస్తాను. నీ కంపెనీ లావాదేవీలన్నీ మామూలుగా కొనసాగుతాయి. సాల్మన్ కంపెనీ వాళ్ళు నీ వ్యవహారాల్లో జోక్యం కల్పించుకోమని వ్రాతపూర్వకంగా హామీ ఇచ్చే ఏర్పాటు కూడా చేస్తాను. అన్నిటికన్నా ముఖ్యంగా నీ సరుకు ముంచేసిన షిప్పింగ్ కంపెనీ నెలరోజుల్లో మొత్తం ఖరీదు చెల్లించేలా చూస్తాను... డాలర్ల రూపంలో...''

ఆమె కన్నార్పటం కూడా మర్చిపోయి ఆయనవైపు చూస్తోంది. ఆయన బ్రీఫ్ కేస్ తీసుకుని లేచి నిలబడి అన్నాడు ''ఇవన్నీ నాకెలా తెలిశాయా అని ఆశ్చర్యపోకు. రంగంలోకి దిగే ముందు అక్కడి వాతావరణం క్షుణ్ణంగా తెలుసుకోవడం పొలిటీషియన్స్ ముఖ్య లక్షణం కదా'' మొట్టమొదటి సారి కాస్త నవ్వాడు.

''నేను ఆశ్చర్యపోతున్నది అందుక్కాదు. నెలకి పది లక్షలు ఇచ్చి, కోటి రూపాయల బ్యాంక్ ఇబ్బందులు తీర్చి... ఇవన్నీ మీరు కేవలం ఒక పెయింటింగ్ కోసం చేస్తున్నారంటే నమ్మలేను.''

ఆయన నవ్వాడు. ''...ఏమీ ఆలోచించకుండా వ్యాపారం చేస్తానని ఎలా అనుకున్నావు? నీ భర్త తప్పకుండా గొప్ప బొమ్మ గీయగలడు. అదృష్టం ఏ మాత్రం బావున్నా కోటి రూపాయలకి తక్కువ కాకుండా దాన్ని నేను అమ్మగలను. ఆ నమ్మకం నాకుంది... ఒక కళాకారుడిని చరిత్రలో నిలబెట్టడానికి అది చాలా తక్కువ ఖర్చు'' ఆమెకు షేక్‌హేండ్ ఇస్తూ అన్నాడు.

ఆ తరువాత, తలుపు దగ్గరగా వేసి బయటకు నడిచాడు. నడుస్తూ అనుకున్నాడు. 'కన్నకూతురి శేష జీవితం చివరి ఆర్నెల్ల పాటు కోరుకున్న వాడి సమక్షంలో ఏర్పాటు చేయటం కోసం... అది చాలా తక్కువ ఖర్చు.'

7

‘‘**నీకేమయినా** మతిపోయిందా? ఆయన కోసం నేను బొమ్మ వేయటం ఏమిటి? దానికి ఆయన నెలకి పది లక్షలు ఇవ్వటం ఏమిటి?’’

‘‘ఏ చిత్రకారుడికీ రానంత డబ్బు’’ అందామె.

‘‘నేను మాట్లాడుతున్నది డబ్బు గురించి కాదు. ఆయన కొచ్చిన ఆలోచన గురించి.’’

‘‘ఏం? తప్పేముంది? పూర్వకాలం రాజులూ, జమీందార్లు అలాగే కళాకారులకి డబ్బిచ్చి బొమ్మలు వేయించటం, కావ్యాలు వ్రాయించటం చేసేవారుగా’’ అంది.

ఆ మాటలకి అతడు దిగ్భ్రమ చెందాడు. ‘‘నేను జమీందార్ల దగ్గర పనిచేసే వాడిలా కనపడుతున్నానా?’’ అతికష్టం మీద తేరుకుని అన్నాడు.

‘‘నా ఉద్దేశం అదికాదు. మైకెలాంజిలో కూడా డబ్బుకే పనిచేసేవాడు కదా– అని.’’

కార్తికేయ వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాడు. ఏదో తెలియని ఇబ్బందితో, ‘‘ఇలా టైమ్ గడువు పెట్టుకుని బొమ్మలేయటం నాకు రాదు. అదీగాక ఆయన ఊహించినంత ఖరీదు బొమ్మ నేను వేయలేను. అసలు ఊహించను కూడా ఊహించలేను’’ అన్నాడు.

‘‘అది మన సమస్య కాదు. ఆయనది.’’

‘‘ఈ ఆలోచన ఆయన కొచ్చింది అయి ఉండదు. అనూజ్ఞదై ఉంటుంది.’’

శ్రీకళ్యాణి నుదురు చిట్లించి, ‘‘అనూజ్ఞ ఆలోచన ఏమిటి?’’ అంది.

‘‘ఎప్పటికయినా నేను అంత గొప్ప బొమ్మ వేయాలని మాటల సందర్భంలో అన్నది.’’

‘‘అన్నట్టు చెప్పటం మర్చిపోయాను. ఆ అమ్మాయి ఢిల్లీ నుంచి మీకేదో వీడియో క్యాసెట్ పంపింది. ఇక్కడే బల్లమీద పెట్టాను. తరువాత చూస్తే కనపడలేదు.’’

అతడు దాని మీద అంత ఆసక్తి చూపకుండా ‘‘పోన్లే. క్యాసెట్ దేముంది? తరువాత చూసుకోవచ్చు’’ అన్నాడు. శ్రీకళ్యాణి అదే ప్రసక్తి కొనసాగిస్తూ ‘‘ఆయన మిమ్మల్ని తనతోపాటు తీసుకువెళ్తానన్నారు. మీకు కావల్సిన సౌకర్యాలన్నీ కల్పిస్తానన్నారు’’ అంది.

‘‘చెప్పానుగా. నీకు బాగయ్యేవరకూ నిన్ను వదిలి నేను ఎక్కడికీ వెళ్ళను.’’

‘‘నాకు జీవితాంతం బాగు కాకపోతే?’’

‘‘వాదించొద్దు కళ్యాణీ. నువ్విక్కడ ఇలా ఉంటే, నే నెక్కడికో వెళ్ళి బొమ్మలు వేస్తూ, కూర్చోలేను.’’

ఆమె చాలాసేపు మాట్లాడలేదు. చివరికి ‘‘సర్లేండి. ఆయనకి కబురు చేసి డబ్బు తిరిగి ఇచ్చేస్తాను’’ అంది నిష్టూరంగా. అతనొచ్చి ఆమె పక్కగా కూర్చుని, ‘‘నన్ను అర్థం చేసుకో కళ్యాణీ. ప్రతీ ఆర్టిస్టుకీ జీవితకాలంలో ఎప్పుడో

ఒకప్పుడు కొంతకాలం పాటు వాక్యూమ్ ఏర్పడుతుంది. దానికి తర్కం ఉండదు. ముందు నువ్వు బాగుపడాలి. అప్పటివరకూ నన్ను బలవంత పెట్టకు. వేయగలనని చెప్పి ఆయన్ని మోసంచేసి మన పబ్బం గడుపుకోవటం నాకిష్టం లేదు. మన ఆర్థికపరమైన కష్టాలంటావా? వాటిని మరోరకంగా అధిగమించటానికి ప్రయత్నిద్దాంలే'' లాలనగా అన్నాడు.

ఆమె అతడివైపు శూన్యంగా చూసింది. అతడు నిస్సహాయంగా నవ్వాడు. ''...కోటి రూపాయల కష్టాన్ని ఏ విధంగా అధిగమించగలం, అని ఆలోచిస్తున్నావా? చూద్దాం. ఏదో ఒకటి జరక్కపోదు కదా'' అన్నాడు.

అతడన్నట్టు ఆ 'ఏదో ఒకటి' ఆ రాత్రే జరిగింది..!

శ్రీకళ్యాణి మంచం పక్కన చిన్న అద్దపు షో కేసులో స్విట్జర్లాండు నుంచి తెచ్చిన ఒక బొమ్మ ఉంది. అది చాలా రొమాంటిక్‌గా ఉంటుంది. ఒకబ్బాయి 75 డిగ్రీలలో నిల్చుని ఉంటాడు. గాజు బొమ్మ నిండా ఈథర్ నిండి ఉంటుంది. గది వాతావరణానికి అది లోపల ఆవిరి అవగానే ఆ అబ్బాయి ముందుకు వంగి, మోకాళ్ళ మీద కూర్చున్న అమ్మాయిని ముద్దు పెట్టుకుంటాడు. అమ్మాయి పెదవులకి అతడి పెదవులు తాకగానే, అమ్మాయి నుంచి కరెంటు ప్రవహించి, అబ్బాయి వెన్నుపూస లోంచి ఒక కాంతి, ద్రవపుచుక్కలా నడుము వరకూ జారి ఆ బరువుకి అబ్బాయి మళ్ళీ నిలువుగా అయిపోతాడు. చాలా సెక్సీగా ఉండే ఆ బొమ్మని రాత్రి పూట గమనించటం ఓ గమ్మత్తయిన అనుభవం.

నాంది మరోలా మొదలయినా, వాళ్ళ సంభాషణ ఆ రాత్రి ఆ బొమ్మ మీదకు వెళ్ళింది. ''నేను రోజు రోజుకీ లావయిపోతున్నాను కదూ'' అంది కళ్యాణి.

అతడు ఆమెని పరీక్షగా చూస్తూ ''అటువంటిదేమీ లేదే'' అన్నాడు.

''ఏ రకమైన ఎక్సర్‌సైజూ లేదు. పడుకుని ఉండటమే కదా...''

''దానికి సరిపోయేటట్టు డైటు కూడా బాగా తగ్గించావు కదా''

ఆమె గతాన్ని తల్చుకుని రవ్వంత విషాదంగా ''బావున్న రోజుల్లో ఎన్ని పనులున్నా కనీసం అరగంటన్నా ఎక్సర్‌సైజు చేసేదాన్ని...'' అంది స్వగతంగా. ఆమె మూడ్ మార్చటం కోసం ''ఈ ప్రపంచంలో సన్నగా ఉన్న వాళ్ళంతా రోజూ ఎక్సర్‌సైజు చేస్తున్నారా ఏమిటి? దేవుడే కొన్ని తప్పనిసరి వ్యాయామాల్ని స్వభావసిద్ధంగా కల్పిస్తాడు'' అన్నాడు నవ్వుతూ.

''అంటే'' అందామె అర్థంగాక.

''అదిగో ఆ బొమ్మ చూడు''

ఆమె దాన్ని చూసి సిగ్గుపడి, అంతలోనే స్పోర్టివ్‌గా తలెత్తి ''ఆ కుర్రాడిలా అయిదు నిముషాల కొకసారి ముద్దు పెట్టుకుంటే ఎన్ని కేలరీస్ ఖర్చవుతాయో తెలుసా?'' అని అడిగింది. కేలరీస్ అంటే కొవ్వు కరిగే శక్తి కొలత.

''ప్రతి ముద్దుకీ ఒక కాలరీ ఖర్చవుతుందనుకుంటున్నాను. ఊరికే 'మ్చ...' అని పెట్టుకుంటే అర పావు కాలరీ. గట్టిగా చేతుల్తో హత్తుకుని గాఢంగా పెట్టుకుంటే రెండు కాలరీలు... అలా అన్నమాట.''

''ఇంత కరెక్టుగా ఎలా చెప్పగలుగుతున్నారు?''

''ఊహించి'' కార్తికేయ నవ్వుతూ అన్నాడు. ''...మనిషిని సన్నగా ఉంచటానికి దేవుడు సృష్టించిన వ్యాయామం అది.''

శ్రీకళ్యాణి ఫకాలున నవ్వేసింది. ఆమె కెందుకో గత పది రోజుల్నుంచీ అనుభవిస్తున్న మానసిక ఒత్తిడికి తాత్కాలిక ఉపశమనం దొరికినట్టయింది. ఆ తరువాత ఈ సంభాషణ మరింత రొమాంటిక్‌గా జరిగింది. నిద్ర పోయేసరికి అర్ధరాత్రి దాటింది. అతడు వెంటనే నిద్రలోకి జారుకున్నాడు. ఆమెకి నిద్రపట్టలేదు. మనసంతా ఆనందంతో నిండి ఉండగా నిద్రెలా పడుతుంది?

ఆ ఆనందంలోనే సన్నగా, అంకురంలా ఒక చిన్న కోరిక పుట్టి చూస్తుండగానే వృక్షమైంది. ఆ కోరిక శరీరాన్ని సాయం కోరినా, అది సహకరించే స్థితిలో లేకపోవడంతో మనసులోనే పెరిగింది. కాస్త దూరంలో నిద్రిస్తున్న భర్త చేతుల మధ్య నలిగిపోవాలన్న కోరిక అది. కానీ దగ్గరకి జరిగే శక్తి కూడా లేదు. వివాహం కాక ముందు ఆమెకి అలాంటి కోరిక రాత్రిళ్ళు కలిగేది. కానీ ఈ ఆక్సిడెంట్ జరిగాక అది దూరమైంది. చాలాకాలం తరువాత ఈ కోరిక నరాల్ని మెలిపెడుతున్నట్టు ఒక వాంఛ.

అతడు నిద్రలో లేడు. ఆ విషయం కూడా తెలుస్తూనే ఉంది. అతడిని లేపుదామనుకుంది లేపి మాత్రం ఏం చేస్తుంది? 'ఉత్తర ధృవం' భూమధ్య రేఖకి సూర్యుడితో ఎంత కబురు పంపినా శీతోష్ణస్థితిలో మార్పుండదు కదా.

నిద్రలో అతడు అట్నుంచి ఇటు కదలటాన్ని ఆమె గమనించింది. ఆమెకు పుస్తక అనుభవమే ఉన్నది. ఎన్ని ఎక్స్... రేటెడ్ చిత్రాల క్యాసెట్లు చూసినా అదంతా వీక్షణమే. లేక కొన్ని సందర్భాల్లో శృతమే. అనుభవం కానీ, ప్రత్యక్షానుభూతి కానీ లేదు. నిద్రలో అతడి కదలికకి అర్థం ఇప్పుడిప్పుడే కాస్త కాస్త అవగతమవుతోంది.

మేఘం వర్షంగా కురవాలంటే చలిగాలి కావాలి. తాపం తడిగా మారాలంటే చెలి తోడు  కావాలి. తనువుకి తనువు సహకరించక పోతే తనకి తనే సాయపడాలి.

అతని కలలో ప్రతీ కదలికా ఆమె మనసు పొరల్లో ఒక వ్యధా భరిత వీచిక సృష్టిస్తూండగా, ఆ రాత్రి ఎప్పుడో ఆమెకు నిద్రపట్టింది.

## 8

''**ఆ ఢిల్లీ** నుంచి వచ్చిన క్యాసెట్ దొరికిందా?'' అని అడిగింది.

''లేదే... నువ్వే ఎక్కడో పెట్టానన్నావ్?''

''ఆ పక్కనే పెట్టేనండీ. ఎవరూ తీసి ఉండరే. ఆ బల్ల మీద చూడండి'' అంది. బల్ల మీద చాలా పుస్తకాలు చిందరవందరగా పడి ఉన్నాయి. అతడు వాటిని అటూ ఇటూ కదిపి చూశాడు. శ్రీకళ్యాణికి సంబంధించిన వస్తువులు అవి. చాలా రోజుల క్రితం, హోటల్లో ఆమె స్పృహ తప్పి పడిపోయిన రాత్రి, అట్నుంచి అటే ఆమెని ఆస్పత్రికి తీసుకెళ్ళినప్పటి

వస్తువులు అవి. వాటిని వెతుకుతూ ఉండగా సగం తెరిచి ఉన్న పర్సులోంచి ఒక విమానం టిక్కెట్టు కనపడింది. అదేమిటా అని తీసి చూస్తే, అతడి ఆశ్చర్యాన్నీ, అనుమానాన్నీ రెట్టింపు చేస్తూ 'కలకత్తా' టిక్కెట్టు అది. దాన్ని బయటకి తీసి, ''ఇదేమిటి'' అడిగాడు.

ఆమె చాలా క్యాజువల్ గా, ''ఆ రోజు మిమ్మల్ని హోటల్‌కి తీసుకెళ్ళినప్పుడు బహుమతిగా అక్కడ ఇవ్వటానికి తెచ్చాను'' అంది.

''దేనికి?''

''మిమ్మల్ని శాంతినికేతన్ పంపటానికి...''

అతడు ఆమె దగ్గరగా వచ్చి ''నాకు అర్థం కావటంలేదు కళ్యాణీ. మరి నాకా విషయం చెప్పలేదేం?'' అన్నాడు.

''ఎక్కడ చెప్పను? హోటల్‌లోనే స్పృహ తప్పి పడిపోయానుగా?''

ఏదో అర్థం కాని ఇబ్బంది ఫీలింగు. ''అది కాదు కళ్యాణీ..! నువ్వు నన్ను ఆ రోజు హోటల్‌కి తీసుకెళ్ళింది... ఈ శుభవార్త చెప్పటానికేనా?''

''అవును. నా ఆస్తంతా పోయిందనుకుని, నా తరఫున జైలుకి వెళ్ళటానికి కూడా మీరు సిద్ధపడ్డారు. నేను చాలా కదిలిపోయాను. అందుకు బహుమతిగా మిమ్మల్ని శాంతినికేతన్ పంపి, మీరు అక్కడ ఎంతకాలం ఉంటే అంతకాలం మీ ఖర్చు నేను భరించేలా ఏర్పాటు చేశాను. ఆ టిక్కెట్టు మీకు హోటల్లో ఇద్దామనుకుని డిన్నర్‌కి పిలిచాను.''

ఎంత పొరపాటు పడ్డాడు..! పిలిచింది  పెళ్లి కోసం అనుకున్నాడు..! అంతకు ముందు రాత్రే ఆమె పెళ్ళి ప్రసక్తి తీసుకురావటంతో, దాని కోసమే డిన్నర్కి తీసుకువచ్చింది అనుకున్నాడు. హోటల్లో కూడా ఆమె ''జైలుకి ప్రతిరోజూ క్యారియర్ తీసుకువస్తా''ననటం తన అభిప్రాయానికి బలం చేకూరింది. అందుకే, ఆస్తిపోయి, నిస్సహాయ స్థితిలో అచేతనంగా పడి ఉన్న ఆమెను వివాహం చేసుకుంటానన్నాడు. ఆమె ఆస్తి పోలేదనీ, 'పెళ్ళి చేసుకుంటావా' అని ఆమె అడగటం సరదాగా తనని ఆట పట్టించటం కోసం అని అనుకోలేదు.

*మీరు నన్ను చేసుకుంటారా / నేనా / మీకేం తక్కువ? గుణముంది, అందముంది. చేతిలో గొప్ప కళ ఉంది. అన్నిటికన్నా మించి మీకు స్వార్థం లేదు / 'నన్ను కాస్త ఆలోచించుకోనివ్వండి / నా దగ్గర డబ్బు లేదనేగా మీరు తటపటాయిస్తున్నారు. దివాళా అప్లికేషన్ పెట్టటానికి నెల రోజులు టైమ్ ఉంది. ఈ నెల రోజుల్లో ఒక పది ఇరవై లక్షలు తీసి దాయమంటారా? ఈ గొడవలు పూర్తయాక మనకి పనికి వస్తుంది / గొడవలు పూర్తయ్యాకా? అంటే... నేను జైలు నుంచి తిరిగి వచ్చాకా? / ఛా ఛా. నా ఉద్దేశ్యం అదికాదు / నా సంగతికేం గానీ, మీరేం చేస్తారు కళ్యాణీ? అది చెప్పండి / ప్రతిరోజూ రెండు పూటలా జైలుకి క్యారియర్ తెస్తాను'/*

ఈ సంభాషణంతా కేవలం తనని పరీక్షించటానికే అన్న విషయం గుర్తించకుండా... శ్రీకళ్యాణిలాంటి పెద్ద వ్యాపారవేత్త ఒక వంటవాడిని ఎలా చేసుకుంటుందన్న చిన్న ఆలోచనే రాక ఆమె కాస్త మంచాన పడగానే తనొక పెద్ద త్యాగమూర్తిలా ప్రపోజ్ చేశాడు.

ఇన్ని ఆలోచనలతో... కలత చెందిన మనసుతో... అతడు దగ్గరగా వచ్చి కూర్చుంటూ ''నేను తప్పుచేశానా కళ్యాణీ? మన పెళ్ళికిముందు నీకు నా మీద అటువంటి అభిప్రాయమే లేదు కదూ'' అన్నాడు.

ఆమె అతడివేపు సూటిగా చూసింది. అతడు మళ్ళీ అన్నాడు. ''నీలో ఆ అభిప్రాయాన్ని కలిగించింది నేనే కదూ. నిస్సహాయమైన స్థితిలో నిన్ను ఈ పెళ్ళికి వప్పించినట్టున్నాను కదూ.''

ఆమె జవాబు చెప్పలేదు.

''చెప్పు కళ్యాణీ! నీ నిస్సహాయ స్థితిని నేను ఉపయోగించుకున్నానా?''

చాలా గాఢమైన నిశ్శబ్దాన్ని పతేలున ఛేదిస్తూ ఆమె అన్నది.

''అవును.''

గ్రీష్మతాపాన్ని భరించలేక ఒక కాకిపిల్ల దాహార్తితో చనిపోతూ దీనంగా అరచిన ఆఖరి అరుపు... అతని గొంతులోంచి బయటకు రాబోయి బలవంతంగా ఆగింది.

ఆమె స్పష్టంగా అన్నది. ''మానసిక సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలనేది నా నమ్మకమని మీకు మొదటి నుంచీ తెలుసు. ఏ పరిస్థితుల్లో మిమ్మల్ని వివాహం చేసుకున్నానో కూడా మీకు తెలుసు. మీరు ఊహించినది నిజమే. ఆ రాత్రి మిమ్మల్ని హోటల్‌కి తీసుకెళ్ళటానికి కారణం, కేవలం మీలాంటి నిజాయితీపరుడైన చిత్రకారుడిని, నా వంట మనిషి స్థానం నుంచి తప్పించి, అతడికిష్టమైన చోటికి పంపాలని! పెళ్ళయిన రోజు నుంచీ నేను సుఖంగా ఉన్నమాట కూడా నిజమే. కానీ, మీ త్యాగాలూ, నిజాయితీలూ నన్ను సంతోషంగా ఉంచలేవు. ఈ విషయం మీరు గుర్తించేలా ఎలా చేయాలా అని ఇంతకాలం ఆలోచిస్తూ వచ్చాను. ఈ రోజు విధివశాత్తు మీరు నమ్మే అవకాశం దొరికింది. ఇలా మంచంమీద పడుకున్న భార్యకి ప్రేమ పేరిట సేవ చేయటం కన్నా, మీ రంగంలో మీరు రాణించి ఈ ప్రపంచపు నెంబర్ వన్ చిత్రకారుడవుతే నేను ఎక్కువ సంతోషిస్తాను.''

మళ్ళీ నిశ్శబ్దం. గుండెల్ని నిలువునా చీల్చే నిశ్శబ్దం. అతడు భారంగా లేచి నిలబడ్డాడు. ఆమె అతని వైపు చూడలేదు. అతడు గాఢంగా నిశ్వసించి ''వివేకానందగారికి చెప్పు కళ్యాణీ! నేను ఒప్పుకున్నానని'' అన్నాడు.

ఆమె గట్టిగా కళ్ళు మూసుకుంది. అతడు గదిలోంచి వెళ్ళిపోవటం తెలుస్తోంది. తలుపు మూసుకున్న శబ్దం వినపడింది. ఆమె కంటినుంచి ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి.

గతంలో ఆమె తన వాక్చాతుర్యంతో, తెలివితేటలతో, వాదనాపటిమతో వ్యాపారంలో చాలామంది ప్రత్యర్థుల్ని ఓడించింది. ఇప్పుడు ఆ ఆర్టుతో తనని తాను ఓడించుకోవటంలో కూడా సఫలీకృతురాలయింది. అంత కఠినంగా తానుండకపోతే అతడు తనని వదిలేసి వెళ్ళడని ఆమెకు తెలుసు.

వెళ్ళక పోతే సుఖంగా ఉండలేడని కూడా తెలుసు.

బల్లమీద కుర్రవాడి స్ప్రింగు బొమ్మ వూగుతూనే ఉంది. రాత్రి పక్కమీద భర్త కదలికలు గుర్తొస్తూనే ఉన్నాయి. కంటి నుంచి కారే నీటిని తుడుచుకునే ప్రయత్నమేమీ చేయకుండా మనసులో అనుకుంది. ఇంతకన్నా నా భర్తకి నేనేం చేయగలను? I CANNOT GIVE HIM A PHYSICAL EJACULATION. LET HIM ATLEAST HAVE A MENTAL EJACULATION."

**సంధ్య తలుపు వెనుక**
**మృత్యువులా ఉండనీ... పొంచుండనీ.**
**నా జీవిత కాన్వాసు మీద నుంచి**
**అతడి కుంచెని తృంచనీ... తప్పించనీ.**

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments